



# అతనికి పిచ్చెక్కింది

రచన:
" కరుణ "

"ఏమండోయ్ డాక్టరుగారూ!" — వరసగా పేషెంట్లను యిన్స్పెక్టు చేస్తున్న నన్ను కేకవేసాడొకడు. కాని ఆగకుండా నేను రెండో పేషెంటుదగ్గర కెళ్లిపోతున్నాను.

"డాక్టర్!" ఈ కేకకు కూడా నేను ఆగలేదు. పిచ్చివాళ్లకేకలనూ, మాటలనూ లక్ష్యపెట్టేదెవరు ?

"ఒరేయి డాక్టర్!" ఈ సారికేకతోబాటు విసురుగా వొక వ్యక్తివచ్చి నా చొక్కాకాలర్ పట్టుకొని ఆపేడు. నేను వెనక్కి తిరిగి ఆ వ్యక్తిని చూసేను. సన్నగా జువ్విచెట్టుకిమల్లె పొడుగ్గా వున్నాడు. చెదరిన సంస్కారంలేని జుట్టు—కొద్దిగా మాసినగడ్డం—పొడుంరంగు ఉలెన్‌ఫాంటు—తెల్లని పాలమీగడలాంటిషర్టు ముఖంలో చెప్పకోదగ్గవి అతని రెండు కళ్ళూ. అవి రెండు రెండు అయిస్కాంతాలే! నేనొక్క క్షణం రెప్పవాల్చకుండా అతనివేపు చూసేను. అతను భయపడుతూ నా కాలర్‌వదిలేసాడు. ఇంతలో నర్స్‌వచ్చి అతన్ని తన బెడ్‌మీదకు నెట్టుకొంటూపోయేడు. నేను పేషంట్లందర్నీ చూసి తిరిగి వెళ్లబోతున్నాను. చటుక్కున గుర్తుకొచ్చి అతని బెడ్‌వద్ద ఆగేను. అతను ఏమనుకొన్నాడో లేచికూర్చున్నాడు. నేను నెమ్మదిగా 'ఏం కావాలోయ్ నీకు?' అన్నాను. అతనొకసారి నన్ను తీక్షణంగా చూచి 'నాక్కావల్సింది నువ్విస్తావా?' అన్నాడు. అంటూ భుజంమీదున్న నాచేతిని విసిరికొట్టేడు. ఐనా నేను కోపం తెచ్చుకోకుండా 'నీక్కావల్సిందేదైనా యిస్తా నన్నానుగా — మరి చెప్పు' అన్నాను. అతనికళ్లల్లో గిర్రున నీరు తిరిగింది. 'నువ్వియ్యలేవు డాక్టర్' అంటూ రెండు చేతుల్తోటీ ముఖం కప్పుకున్నాడు. 'ఇస్తాను అదేమిటోచెప్పు!' అనలే పిచ్చివాడుగా వున్న అతని మనసుకి క్లేశాన్ని కల్గించటం యిష్టంలేక బ్రతిమాలేను. అతడు వొక పది నిముషాలు ఆలోచించి అన్నాడు. 'లేదు — నువ్వుకూడ మోసంచేస్తావ్!' అని అరిచేడు. నే నొక తృటికాలం స్తంభించిపోయేను. తరువాత కోలుకొని 'మోసమా?'అన్నాను. అతడు జుత్తుని సవరించుకొంటూ 'మోసమే-అంటే అర్ధం తెలీదా? రాధ నన్ను చేసిందిగా....అదే మోసం' అంటూ బావురుమన్నాడు.

రాధ! — రాధ!

నాలో గాఢాంధకారంలో వొకమెరపు మెరిసినట్లయింది. ఆ మెరుపుని భరించలేక వొక్క క్షణం కళ్ళుమూసుకొన్నాను. తర్వాత విసురుగా నా ఆఫీసురూంలోకి వచ్చేసాను. 'రాధ నన్ను చేసిందిగా!—అదే మోసమంటే' అన్న వాక్యం నాలో వెయ్యి గొంతుల్తో హోరున అరుస్తున్నట్లుగా వుంది.

రాధ!—ఎవరీ రాధ ?—

అతన్నే కనుక్కొంటే పోయేదిగా! కాని పిచ్చివాడినింకా ప్రశ్నల్తో బాధించి విసిగిస్తే సంప్రాప్తమయేదేమిటి?–అయినా పిచ్చివాడిని అతనిమాటల్ని లెక్కపెట్టటమేమిటి ? అనుకోకుండా నా చెయ్యి ఫోనుమీద కెళ్లింది. రిసీవర్నెత్తి నెంబర్ డయల్ చేసాను. అమె నుండి కమ్మనికంఠం "హలో! రాధా సుందర్ హియర్‌ప్లీజ్!" పల్కింది.

"రాధా! నేను హాస్పిటల్‌నుండి మాట్లాడుతున్నాను. ఉన్నపాటున వొక్క క్షణంలో రా" ఆతృతగా మౌత్‌పీస్‌లో అనవలసిన నాలుగు మాటలూ అనేసి రిసీవర్ని పెట్టేయబోతుంటే అటునుండి రాధ "ఏం — అంత అర్జంటేమొచ్చె!—అబ్బబ్బ!—మీకు మరీ పిచ్చెక్కుతోంది" అన్నమాటలు విన్పించినయ్! నిజమే రాధా! నాకీ క్షణంలో పిచ్చెక్కనట్లేవుంది అనుకొన్నాను. నా మెదడు చురుగ్గా పనిచేయసాగింది. ఆలోచనల్లు తీవ్రమైన వేగంతో పరుగులు తీస్తున్నాయి. రాధ — అని పదే పదే మనసు అరుస్తోంది. కాని అంతుచిక్కటం లేదు ఎంతకీవిషయం. అంధకారంలో మిణుగురు పురుగులా రాధ నామ స్మిష్కంలో తరచి తరచి మెరుస్తోంది. సిగరెట్టుమీద సిగరెట్టు తగలేస్తున్నాను. పొగతో ఆ ఫీ సు రూమంతా నిండిపోయింది. ఆ పొగలో కళ్ళుమండుతూంటే క్షణం మూసుకొన్నాను. ఎదురుగా వేలు, లక్షలు, కోట్లలు రా ధ లు భరించలేక కళ్ళువిప్పేను. నోట్లోపెట్టిన సిగిరెట్టంటించటానికి నిప్పుపెట్టె వెదకుతుంటే మెత్తనిగాజుల శబ్దం మరుక్షణంలో అగ్గిపుల్లకాంతి — ఆ కాంతిలో మసక మసకగా రాధ ముఖం.

సిగరెట్టంటించి స్విచ్ అన్‌చేస్తూ "చీకట్లో కూర్చుని ఏంచేస్తున్నారండి?" అంటూ క్రింద పడివున్న సిగరెట్టు పీకలనుచూసి అమ్మో! ఎన్ని సిగరెట్లో! మీకేమైనా పిచ్చెక్కిందేమిటి? అంటూ నోట్లోని సిగరెట్టు లాక్కొని ఏష్ట్రే లోకి విసిరేసింది. నేనొక క్షణం రాధ ముఖంలోకి చూచి తలదించుకొన్నాను. రాధకేమీ అర్ధంగాక నావంకచూస్తూ "ఏమిటి—చీకట్లో వొక్కరే కూర్చున్నారేం?" అంది. నేనొకసారి ఆమెవేపు పిచ్చిగా చూసేను తర్వాత చీకటి ఏకాంతం యివి దేన్ని సూచిస్తాయి రాధా ? అన్నాను. రాధకి నా మాటలు అర్ధంకాలేదని అమె ముఖమేచెప్తోంది 'ఏమిటండీ! మీరనేది నాకేం అర్ధంగాలేదు' అంది తెల్లబోతూ.

"నాకూ అర్ధంకావటంలేదు రాధా! ఉజ్వలంగా ప్రకాశించే వొక తార నింగినుండి టపీమని నేల రాలింది! అంధకారంలో కలిసిపోయింది. అంధకారంలో మిలమిలా మెరుస్తున్నదాన్ని జ్యోతి అని సమీపిస్తె మిణుగురు పురుగై వూరుకుంది. నా కన్నుల్లో బాధ! ముఖంలో ఆవేదన. రాధ క్షణం స్థంభించిపోయింది. ముఖం పాలిపోయింది. పేలవంగా నవ్వుతూ 'మీలో కవిత్వం ఆవేశించినట్లుందే' అంది.

"మానవత్వం నశించబోయే సమయమాసన్నమవుతున్నపుడు వచ్చే పేలాపనని కవిత్వం అనే అర్ధమే నీ పరిభాష అయితే నాలో కవిత్వమే ఆవేశించింది రాధా!"

"అబ్బ! ఏమిటండీ! అంతా అర్ధంకాని గొడవ—యింటికి పోదాంరండి!" అంది తను లేచి చేయిపట్టి నన్ను లేపుతూ—

"వస్తానురాధా! వొక్క క్షణం!" అంటూ ఆమెను కూర్చోమని సంజ్ఞచేస్తూ ప్రారంభించేను. 'నీకర్ధంగానిమాటల్తో వ్యర్ధంగా కాలాన్ని గడపటానికి నేను ఫోనుచేయలేదు—"

ఆమె కర్థంగాక తన అరచేతిని మునివేళ్లతో కొట్టుకొంటూ 'మరి?' అంది.

నే నొకసారి నవ్వేను — సహజంగాకాదు. ప్రయత్నపూర్వకంగానే — అలా నవ్వుతూనే 'రాధ నన్ను చేసిందిగా అదేమోనం' అన్నాను.

ఆమె తెల్లబోయింది పాలిపోయింది. నిలువునా వణికిపోతోంది. ఎండుటాకులా, చిత్తు కాగితంలా కంపించిపోతోంది. ఆమెపెదవులు ఉద్విగ్నంగా వణుకుతున్నాయి. కళ్లలో లేకితనం - బేలతనం - చివరకి ముఖాన్ని పైకెత్తి 'ఏమిటి మీరనేది? మీకు పిచ్చెక్కింది' అంది.

“ఇది నే నన్నమాటలు కావురాధా! వొక పిచ్చివాడన్నది' అంటూ ఆమె యింకేమీ



ప్రశ్నించకుండా ఆమెచెయ్యిపట్టుకొని గబగబా యిందాకటి పేషెంటుదగ్గరకి లాక్కొచ్చేను. అతడు మా యిద్దర్నీ చూచి బిత్తరపోయేడు. రాధ అతన్నిచూస్తూ బాధతో మూలిగింది. చూడలేక ముఖాన్ని క్రిందకు దించుకొని కళ్ళుమూసుకొంది. ఆ యువకుడు పదే పదే రాధని తరచి, తరచి చూస్తున్నాడు. ఏదో జ్ఞాపకం తెచ్చుకోటానికి ప్రయత్నిస్తున్నాడు.

నెమ్మదిగా రాధచెవిలో గొణిగేను - 'రాధా! ఎవరితను?—'

రాధ నీరసంగా నా రెండుచేతులు పట్టుకొంది. ఆమె కన్నుల్లో నీరు తిరిగింది

“నాకు తెలీదు—రండి పోదాం” అంది.

“కాదు. నీకు తెలుసు—చెప్పు రాధా! ఎవరితను?—” ఆమెను నిలువునా కుదుపుతూ ప్రశ్నించేను. ఆమె దుఃఖం అధికమయింది. దాన్ని అపుకోలేకపోతోంది. “నాకు తెలీదంటే నన్నెందుకిలా బాధపెడ్తారు?—ఎవర్నో దారినపోయేవాడిని ఎవరతను అంటే నేనేం చెప్పగలను?” అంది.

ఏం చెప్పలేదు! - రాధ ఏమీ చెప్పలేదు! - హు!—ఎందుకు చెప్పలేదు?—రాధ కేమీ ఎందుకు తెలీదు. అంతా తెలుసు! కాని దాస్తోంది.

అప్పటికే స్టాఫ్ అంతా వింతగా చూస్తోంది. అక్కడుండటం అసహ్యమనిపించి రాధ చెయ్యిపట్టుకొని గబగబా రూంవేపు నడక సాగించేను. ఇంతలో వెనుకనుండి ఆ యువకుడు “రాధా!—రాధా!” అని రెండుసార్లు బిగ్గరగా అరిచేడు. రాధ ఆ పిలుపు విని తూలి తుళ్లిపడింది. ఆమె తల తిరుగ నారంభించింది. కన్నుల్లో వరదల్లా కన్నీరు ప్రవహిస్తోంది. తల రెండు చేతుల్తోనూ పట్టుకొని ఎదురుగానున్న కుర్చీలో కూలబడింది. ఆ యువకుని పిలుపు విని నే నదిరిపడ్డాను. నాలో ఆలోచనలు ముమ్మరంగా సాగుతున్నాయి. రాధని ఆ వ్యక్తి గుర్తుపట్టేడు. ఆ వ్యక్తినికూడ రాధ గుర్తుపట్టింది. అవును—లేకపోతే అతను ఎందుకలా అరిచేడు ఆ అరుపువిని వుండేలు దెబ్బతిన్న చిలకలా గిలగిలలాడుతూ రాధ ఎందుకొరిగిపోయింది?

“రాధా! ఎవరతను?” తిరిగి ప్రశ్నించేను. రాధ తన రెండుచేతుల్తోనూ ముఖాన్ని కప్పుకొని బావురుమంది. “నాకు తెలీదంటే నన్నెందుకిలా చిత్రవధ చేస్తారు?” అంది బాధగా.

'నీకు తెలుసు రాధా! అతనెవరో నీకు తెలుసు. ఎందుకు నీలో నువ్వు కుమిలిపోతావు?—చెప్పు అతనెవరు?'

'నాకు తెలీదు — నేను .... ఏబాధ పడ్డంలేదు!' రాధ నీరసంగా జవాబిచ్చింది.

నాకు విసుగెత్తింది. గదంతా పచార్లు చేస్తున్నాను. రాధనుండి రహస్యాన్నెలా తెలుసుకోటం? — చివరకి ఆమె రెండు భుజాలూ పొదవి పట్టుకొని 'రాధా!-చెప్పు!-ఎందుకు రాధా దాస్తావు? — చెప్పవూ?' అన్నాను.

'నాకు తెలీదండీ!—తెలీదంటే నమ్మరేం?' అంది రాధ.

ఇక రాధ దగ్గర్నుండి రహస్యాన్ని తెలుసుకోటం అన్నది దుర్లభం. ఆమెనీ సమయంలో ఇంకా వత్తిడిచేస్తే ఆమెకూడా పిచ్చిదౌతుందేమో నన్న భయం కల్గింది. కాని నేనీ రహస్యాన్ని తెలుసుకోకపోతే నేనే వున్మాదినౌతానేమో!—ఏంచేయాలి?—ఏ విధంగా ప్రవర్తించాలో నాకర్థం కాలేదు. విసురుగా రాధ చెయ్యిపుచ్చుకొని కార్లో కూర్చోపెట్టి కారుని స్టార్ట్‌చేసాను. కారు మెత్తని తారురోడ్డుమీద శబ్దం చెయ్యకుండా దూసుకుపోతోంది. మెదడు నిశ్శబ్దంగా ఆలోచిస్తోంది. మనసంతా వుదాసీనంగావుంది. రెండుమూడుసార్లు ఏక్సిడెంటు అవబోయి వెంట్రుకవాసిలో తప్పిపోయింది. రాధ యివేమి గమనిస్తున్నట్లు లేదు. వెనుకసీటులో జారబడి శూన్యంగా ఎటో చూస్తోంది. ఆమె కనుకొలకుల్లో కన్నీటి బిందువులు నిలచివున్నాయి. బాగా ఏడ్చివుండటం మూలంగా కళ్లువాచి కనురెప్పలు తడిసిన కలువరేకుల్లా బిరుసుగావున్నాయి. ఆమె ఎర్రని, నున్నటి చెక్కిళ్లపై యింకా కన్నీటిచారలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఒకసారి రాధ ముఖంలోకి చూచి విసుగ్గా నాలో నేననుకొన్నాను. 'రాధా! వున్నదేదో చెప్తే పోయేదిగా—మనిద్దరి మనసూ ప్రశాంతంగా వుండేది'—కాని, ఆమె నా గొణుగుడు వినిపించుకోలేదు. అసలామెను చూస్తుంటే ఈ లోకజ్ఞానం బొత్తిగా లేనట్లుంది. కార్ని

బంగళాలోకి పోనిచ్చి — రాధని యింట్లోకి తీసికెళ్లేను.

ఆమె కారు దిగుతూనే తన గదిలోకి పారిపోయి తలుపువేసుకొని మంచంమీద పడి ఏడ్వటం ప్రారంభించింది. నేను కారుతీసికొని పార్కుకి వెళ్లేను. పార్కుకు చేరుకొన్నా నన్నుమాటేగాని అక్కడి వాతావరణం నాకేమీ ప్రశాంతతని చేకూర్చలేకపోయింది. పైగా నాలో ఆలోచనలు సాలెగూడులా అల్లుకో నారంభించేయి. ఇక అక్కడ వుండలేక యింటికొచ్చేశాను. వస్తూనే రాధ గదివద్ద కెళ్లేను. తలుపులు రెండూ బార్లా తెరచి వున్నాయి. ఆమె టేబిలుమీద తలవాల్చుకొని కూర్చుంది. నేను క్షణం ఆలోచించి ఆమె గదిలోకి వెళ్లేను. నెమ్మదిగా ఆమె తల నిమురుస్తూ 'రాధా!' అన్నాను. రాధ బరువుగా కళ్లు విప్పింది. ఒకేసారి నా కళ్లల్లోకి చూసింది. ఆ కన్నుల్లో కన్నీరు గిర్రున తిరిగింది. పెదవులు ఏదో చెప్పాలని కదిలేయి. కాని నోటినుండి ఏవిధమైన ధ్వని రాలేదు. కాని ఆమె కదిలిన పెదవులు—బరువుగా తెరచిన కన్నులుమాత్రం ఒకసందేశా న్నందించేయి - 'నన్ను క్షమించరూ' అని. నేనామె ననునయిస్తూ 'రాధా! నాకేమి చెప్పొద్దు. అవును రాధా!—నాకేమీ—' ఆమె పేలవంగా నవ్వింది. ఆ నవ్వులో జీవంలేదు. నెమ్మదిగా కళ్ళు మూసుకొంది. ఆ కన్నులలోని కన్నీటి కణాలు తామరాకుమీది నీటిబొట్లలా మెరుస్తున్నాయి. చేతులలోకి తీసుకున్న రాధ తల బరువుగా నా చేతులలోకి వాలిపోయింది.

'రాధా!—రాధా!'

కాని రాధ పలుకలేదు. ఆమె నా పిలుపు కతీతమైన దూరంలోవుంది. ఆమె నా పిలుపు నందుకోలేదు. ఆమెకు నా పిలుపు అర్థంకాదు. ఈ లోకానికి ఆమెకు ఋణం తీరిపోయింది. ఆమె ఒకచేతినుండి 'పాయిజన్' అన్నసీసా, రెండోచేతినుండి ఒక కాగితంమడత జారి పడ్డాయి. నెమ్మదిగా విచలితమైన మనసుతో, కంపితహస్తాలతో కాగితంమడత విప్పేను. కన్నీరు కమ్మిన నయనాలను తుడుచుకొని అది చదవ నారంభించేను.

'మిమ్మల్ని ఏమని సంబోధించాలో నిర్ణయించుకోలేక సంబోధన మానివేస్తున్నాను. మీరు యిచ్చిన గౌరవాదరాభిమానాలకు నేను తగినదాననో, కానో నిర్ణయించాల్సిన న్యాయాధికారులు మీరే—ఈ క్షణంలో ఈ విషయం మీకు చెప్పటానికి నేను అంతరాత్మతో ఎంత పోరునల్పేనో-మనసుతో ఎంత మర్షణపడ్డానో-కొన్నిగంటల సంఘర్షణ ఫలితమే ఈలేఖ. దాని ఫలితమే నా ఆత్మహత్య!—

హాస్పిటలులో నాకు మీరు చూపించిన 'రాధా! ఎవరితను' అని అడిగిన యువకుడు స్వయంగా నాకు బావ!—మీరు ఆశ్చర్యపోతున్నారుకదూ—బహుశా మీకు మా కుటుంబ విషయాలు తెలియకపోవటంవల్ల మీకు ఆశ్చర్యంగానే కన్పించవచ్చు. కాని అతను మా బావ!—పేరు శివం.

శివం నేను చిన్నప్పటినుండీ కలసిమెలసి వుండేవాళ్లం. నేను తీగనయితే అతను చెట్టు. నేను పుష్పాన్నయితే అతను భ్రమరం. నేను బింబం, అతను ప్రతిబింబం. మా యిద్దరి మధ్యా పరస్పరానురాగం ప్రబలింది. రాను రాను మా వయసుతోబాటు మా ప్రేమలత కూడ పెరిగింది. కాని విధి ప్రతికూలించింది. కొన్ని ఉపద్రవాలవల్ల మా యిద్దరికీ వివాహం కాలేదు. మా ప్రేమ భిన్నమయింది. అంతే!—శివం—నా యాపానికి, నా మనసుకి, నాకు మూలంఅయిన శివం పిచ్చివాడయ్యేడు. నాటినుండి నేటివరకూ శివం నాకంటబడ లేదు. కాని ఈనాడు వొక పిచ్చివాడుగా ఈ కృతఘ్నురాలి నామాన్ని స్మరించుకొంటూ - గతాన్ని మరువలేక - జ్ఞాపకాల్ని నెమరువేసుకొంటూ జీవచ్ఛవంలా కన్పించేడు. అతన్ని చూచేసరికి నా నవనాడులు కృంగిపోయేయి. నేను అతనికి చేసిన ద్రోహఫలితం ప్రత్యక్షంగా చూడడంతో నామనసు వికలమయింది. 'రాధ నన్ను చేసిందిగా. అదే మోసం!'—ఎంత నిశితంగా, నిశ్చయంగా మోసాన్ని నిర్వచించేడు. మోసానికి పర్యాయపదమే రాధ! - కాదు రాధ ప్రవర్తన - అటువంటి కుటిలం - మోసభూయిష్టమైన రాధ ప్రవర్తన జీవించకూడదు. కాని ప్రవర్తన రూపుమాపాలంటే రాధని అంతంచేయాలి. నన్ను నమ్మి, నాప్రేమని విశ్వసించి, నన్నే సర్వస్వంగా వూహించుకొంటున్న వ్యక్తి మనసును నిలువునా దహించివేస్తుంది. నా యీ మరణం కాని తప్పదు. నాకు తెలుసు మీబాధ! మీ క్లేశం. అయినా మోసానికి మారుపేరయిన నేను యిక జీవించటంవల్ల నా మనసుని, మిమ్మల్ని యింకా శివాన్ని క్షోభపెట్టటం తప్ప ఏ యితర లాభమూలేదు. కనుక నేను మరణిస్తున్నాను. ఈ నా తుదిక్షణాలలో నేను భగవంతుని కోరుకొనేదొక్కటే-మళ్ళీ జన్మంటూ వుంటే నన్ను ఒక స్త్రీగా పుట్టించవద్దనే.

—'రాధ'.

ఉత్తరాన్ని చదివి నిర్విణ్ణుడయ్యేను. 'రాధా! రాధా! రాధా!' ఇల్లదిరిపోయేలా-కాదు పద్నాలుగు భువనాలూ అదిరిపోయేలా అరిచేను. ఎంతపనిచేసింది రాధ!—నా రాధ!—నా జీవనజ్యోతి — నా ప్రేమమూర్తి! — ఏం పనిచేసింది. వెయ్యి శివాలగొంతులు ఒక్కసారిగా 'రాధ నన్ను చేసిందిగా! — అదే మోసం' అని అరిచినట్లనిపించింది. కాళ్ళు తిరగ నారంభించేయి. మెదడు పనిచెయ్యటం మానేసింది. శ్వాస బరువుగా వస్తోంది. రక్తప్రసరణం తీవ్రంగా జరుగుతోంది. నాచేతులు నాకు తెలీకుండా జుట్టులోకి పోయేయి. పెదవులపై జీవంలేని చిరునవ్వు మొలకెత్తింది ఉత్తరక్షణంలో అది వికటాట్టహాసమయింది ఆ వికటాట్టహాసంతోబాటు నా నోటినుండి 'రాధ నన్ను చేసిందిగా!—అదే మోసం!—' అన్నమాట వెలువడింది. పదేపదే ఆ పదం నానోట నృత్యం చేస్తోంది. అలా అరుస్తూనే మేడమెట్లు దిగి పూరిమీద పడ్డాను.

★

